మేడ్చల్ తహసీల్దార్‌గా భూపాల్


బాధ్యతలు స్వీకరిస్తున్న భూపాల్

మేడ్చల్: మేడ్చల్ తహసీల్దార్‌గా వి.భూపాల్ గురువారం బాధ్యతలు చేపట్టారు. సంగారెడ్డి జిల్లా న్యాలకల మండల తహసీల్దార్‌గా పని చేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. 6 నెలల క్రితం మేడ్చల్ తహసీల్దార్‌గా పని చేసిన శైలజ పలు ఆరోపణల మధ్య ట్రాన్స్‌ఫర్ కావడంతో ఇన్నాళ్లు డిప్యూటీ తహసీల్దార్‌గా సునీల్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా కొనసాగారు.

సెట్ బ్యాక్ లేని నిర్మాణాలను అడ్డుకోవాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

శామీర్‌పేట్: సెట్‌బ్యాక్ లేకుండా చేపడుతున్న నిర్మాణాలను అరికట్టాలని అలియాబాద్ మున్సిపాలిటీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు అలియాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అలియాబాద్ మున్సిపల్ లాల్‌గడి మలక్‌పేట పరిధిలోని 641 సర్వే నంబర్‌లో నిర్మిస్తున్న భవనం సెట్ బ్యాక్ వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీ అందజేత


అందజేస్తున్న మెర్సీ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులు

జవహర్‌నగర్: మెర్సీ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ చెన్నాపురంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు బ్యాగులు, స్టేషనరీని గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు కెరోలిన్, సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం

బోడుప్పల్: హైదరాబాద్‌లో ఈనెల 4న జరగనున్న ఆత్మీయ సమ్మేళనంపై మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో గురువారం సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు కొత్త ప్రభాకర్‌గౌడ్, విశ్వం గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ హరినాథ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నలుగురు బాల కార్మికులకు విముక్తి

కుషాయిగూడ: ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా గురువారం నలుగురు బాల కార్మికులకు విముక్తి కల్పించారు. కుషాయిగూడ పోలీసులు, మల్కాజిగిరి ఎస్‌ఓటీ పోలీసులు, సీడబ్ల్యూసీ ప్రతినిధులు సంయుక్తంగా గురువారం తనిఖీలు నిర్వహించి వివిధచోట్ల పనుల్లో ఉన్న బాల కార్మికులను గుర్తించారు. నింబంధనలను ఉల్లంఘించి పిల్లలను పనిలో పెట్టుకున్న యజమానులను సీడబ్ల్యూసీ ఎదుట ప్రవేశపెట్టి వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఉప్పల్: గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట ప్రాంతానికి చెందిన కాట్రావత్ నరేశ్ (27) వ్యక్తిగత కారణాల వల్ల 3 రోజుల క్రితం ఉప్పల్ బగాయత్‌లో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతన్ని ఓవైసీ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అల్వాల్ ఇన్‌స్పెక్టర్ బదిలీ

అల్వాల్: అల్వాల్ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌దేవ్‌ను సిటీ సెక్యూరిటీ విభాగానికి బదిలీ అయ్యారు. గురువారం సైబరాబాద్ కమిషనర్ వెల్లడించిన ఉత్తర్వుల మేరకు సీసీఎస్ రాజేంద్రనగర్‌లో పనిచేస్తున్న ఏ.ప్రశాంత్ అల్వాల్ ఇన్‌స్పెక్టర్‌గా రాహుల్‌దేవ్ స్థానంలో ఇక్కడికి వచ్చారు.

పారిశుద్ధ్యంపై పట్టింపేది..?

- రోజుల తరబడి పేరుకుపోతున్న చెత్తాచెదారం
- అధ్వానంగా జనవాసాల సమీప ప్రాంతాలు
- ఇబ్బందుల్లో స్థానికులు,
- పట్టని అధికారులు


చీర్యాల జేఎస్ఎంయూఆర్ కాలనీ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. కాలనీలు, జనవాసాల మధ్య ఉన్న చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు మున్సిపల్ సిబ్బంది తొలగించకపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. చీర్యాల పరిధిలోని జేఎస్ఎంయూఆర్ కాలనీ, వీఆర్ఆర్ ఎన్‌క్లేవ్, అహ్మద్‌గూడ-హరిదాస్‌పల్లి, ప్రధాన రహదారికిరువైపులా పలు కాలనీల


అహ్మద్‌గూడ వార్డు కార్యాలయ సమీపంలో చెత్తాచెదారం

కూడళ్లు, కీసర-భోగారం ప్రధాన రహదారి, కీసర దాయర రహదారి, అహ్మద్‌గూడ వార్డు కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారి వద్ద నిత్యం చెత్తాచెదారం పేరుకుపోతోంది. అయినా మున్సిపల్ అధికారులు తగు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల మున్సిపల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కాలనీలు వెలసి జనాభా కూడా పెరిగిపోయింది. ఈమేరకు దమ్మాయిగూడ పాత మున్సిపల్ పరిధితో పాటు, వీలిన గ్రామ పంచాయతీల్లోనూ మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేందుకు కార్మికుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తాచెదారం పేరుకోకుండా చూడడంతో పాటు దోమల నివారణ మందు పిచికారీ చేయించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు మరిన్ని చర్యలు చేపడుతాం. సత్వరమే వివిధ ప్రాంతాలు, కాలనీల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తాం. అలాగే దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.

-వెంకట్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్

మర్యాదపూర్వక కలయిక


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో మేడ్చల్ నాయకులు


రాంచందర్‌రావుతో నాగారం నాయకులు

మేడ్చల్: రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు రాంచందర్ రావును నగరంలోని ఆయన నివాసంలో మేడ్చల్‌కు చెందిన పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు జగన్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, రాఘవరెడ్డి, మహేశ్ తదితరులు ఉన్నారు.

నాగారం నాయకులు..

కీసర: నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, బీజేపీ అధ్యక్షుడు నాగరాజుల ఆధ్వర్యంలో రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడిని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సురేశ్, శ్యాంసుందర్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, సురేశ్, శ్రీనివాస్‌యాదవ్, కొండల్‌రెడ్డి, నరేశ్, వెంకటేశ్వర్‌రావు, వేణు, జ్యోతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటిన కండక్టర్


విద్యార్థి అక్షయకు బ్యాగును అప్పగిస్తున్న డీఎం

మేడ్చల్: బస్సులో మరిచిపోయిన బ్యాగును విద్యార్థికి అప్పగించి ఓ కండక్టర్ నిజాయితీ చాటుకున్నది. కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం బాసర గ్రామానికి చెందిన అక్షయ మేడ్చల్‌లోని కళాశాలలో చదువుతోంది. ఆమె మేడ్చల్ డిపోకు చెందిన రామాయంపేట్ బస్సులో ప్రయాణించి తన బ్యాగును మరిచిపోయింది. బ్యాగులో పుస్తకాలతో పాటు ల్యాప్‌టాప్ కూడా ఉంది. గమనించిన కండక్టర్ మంగమ్మ బ్యాగును డీఎం సుధాకర్‌కు అప్పగించింది. బ్యాగులో ఉన్న వివరాల ప్రకారం విద్యార్థి అక్షయకు సమాచారం ఇవ్వడంతో గురువారం ఆమె మేడ్చల్ డిపోకు రాగా డీఎం సుధాకర్ బ్యాగును అప్పగించారు.

యూఎల్‌సీ సమస్యను పరిష్కరించండి


జిల్లా కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్, కాలనీవాసులు

గౌతంనగర్: మల్లికార్జుననగర్‌లో పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ యాక్ట్ (యూఎల్‌సీ) సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరిని గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1978లో మల్లికార్జుననగర్‌లో కొందరు యూఎల్‌సీలో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి, బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, భైరు అనిల్, మల్లికార్జుననగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు వెంకటయ్య, అచ్యుతరావు, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి


ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కాలనీ మహిళలు

మౌలాలి : పిల్లినర్సింగరావు కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు మహిళలు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోర్‌వెల్ మరమ్మతులు చేయించాలని, సింగిల్ ఫేజ్ నుంచి త్రిపుల్ ఫేజ్‌కు విద్యుత్‌ను మార్చాలని, అలాగే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, తాగునీరు, డ్రైనేజీ, మురుగునీటి సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారని వారు తెలిపారు.

ధర్మ సమాజ్ పార్టీ జెండా ఆవిష్కరణ


మేడిపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

మేడిపల్లి: మండలకేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ జెండాను గురువారం ఆవిష్కరించారు. మండలాధ్యక్షుడు పరునంది వేంకార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రేడపాక కమల్‌రాజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్య స్థాపనకోసం పోరాడుతున్న ఏకైక పార్టీ ధర్మసమాజ్ పార్టీ అని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో సుమారుగా 1200 మంది ప్రాణత్యాగాలు చేశారని అందులో రెడ్డి, వెలమలు లేరని ఆరోపించారు. త్యాగాలు బడుగు బలహీన వర్గాలది, భోగాలు అగ్రవర్ణాలదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మనకోసం పోరాడుతున్న ధర్మసమాజ్ పార్టీ నాయకత్వంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మదన్, నవీన్‌కుమార్, బాలరాజు, సురేశ్, ప్రభాకర్, జాఫర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా బాలుడి మృతి

పోచారం: అనుమానాస్పద స్థితిలో ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మూడావత్ దశరథ్, భార్య పిల్లలతో అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో మూడేళ్లుగా ఉంటూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దశరథ్ భార్య సరిత చనిపోవడంతో సరోజను రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకు కుమారుడు సంతోష్ (15), రెండో భార్యకు కుమారులు అఖిల్ (6), రవితేజ (2.5) ఉన్నారు. మేడ్చల్‌లోని ఎస్టీ హాస్టల్‌లో సంతోష్ ఏడో తరగతి చదువుతున్నాడు. చదువుపై సంతోష్ ఆసక్తి చూపకపోవడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటున్నాడు. బుధవారం తండ్రి పనిమీద సొంత ఊరికి వెళ్లాడు. భార్య సరోజ నారాయణ జూనియర్ కాలేజ్‌లో పనికి వెళ్లింది. సాయంత్రం సరోజ ఇంటికి తిరిగి వచ్చే సరికి సంతోష్ బట్టలు లేకుండా కింద పడి ఉన్నాడు. నోటి నుంచి రక్తం రావడంతో వైద్యం కోసం ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తండ్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


సాయి ప్రకాశ్ (ఫైల్)

ఘట్‌కేసర్: బీటెక్ విద్యార్థి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఘట్‌కేసర్ రైల్వేపోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మహబూబ్‌నగర్ జిల్లా బెల్లంపల్లికి చెందిన చీర శ్రీనివాస్ కుమారుడు సాయి ప్రకాశ్ (22) హైదరాబాద్‌లోని సైదాబాద్‌లో గల ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. 2 నెలలుగా అంతుచిక్కని మనోవేదనతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వైద్యం చేయించి, ఆరోగ్యం కుదుటపడ్డాక కాలేజీకి పంపిస్తున్నారు. బుధవారం సాయంత్రం సాయి ప్రకాశ్ కాలేజీ నుంచి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలోని అంకుసాపూర్‌కు చేరుకుని చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ పండరి తెలిపారు.

ప్రేమ పేరిట మోసం చేసిన వ్యక్తి రిమాండ్

మల్లాపూర్: ప్రేమ పేరిట యువతిని మోసం చేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిని నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన దాసరి చంద్రయ్య కుమారుడు మహేందర్ అలియాస్ డాంగ్లి మహేశ్ (28) నాచారానికి చెందిన (19) ఏళ్ల యువతిని ప్రేమ పేరుతో ప్రలోభపెట్టి బలవంతంగా లైంగింక సంబంధం పెట్టుకున్నాడు. ఆ యువతి గర్భం దాల్చింది. వివాహం చేసుకోమని అడగగా తనకు పెళ్లి అయిందని ముగ్గురు పిల్లలు ఉన్నారని తెలిపాడు. దీంతో మోసం పోయానని తెలుసుకున్న యువతి ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. కేసు నమోదు చేసిన నాచారం పోలీసులు దాసరి మహేందర్‌ను అరెస్ట్‌చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. మహేందర్ గంజాయి, ఇతర కేసుల్లోనూ నిందితుడని సీఐ తెలిపారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: ఎల్బీ స్టేడియంలో ఈనెల 4న నిర్వహించే కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళన బహిరంగ సభను విజయవంతం చేయాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ పిలుపునిచ్చారు. బాలాజీనగర్‌లో జవహర్‌నగర్ కార్పొరేషన్ పార్టీ ముఖ్య నాయకులతో గురువారం సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్బీ స్టేడియంలో నిర్వహించే సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్నారని దేశంలోనే మొదటిసారిగా గ్రామస్థాయి అధ్యక్షులతో జాతీయ పార్టీ అధ్యక్షుడు మాట్లాడడం ఇదే మొదటిసారి అన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతికోటేశ్‌గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు వేణు, సాయికుమార్, నాయకులు సదానందం, శ్రీనివాస్, సతీశ్‌గౌడ్, వినయ్, భాస్కర్, యాదగిరియాదవ్, రమేశ్‌చారి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందించాలి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఐక్లీన్ ఎండీ ఓకేజిమ్

మేడ్చల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలకు సహకారం అందించాలని ఇంటిగ్రేటెడ్ క్లీన్ రూమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐక్లీన్ కంపెనీ) చైర్మన్ గోపి అన్నారు. గుండ్లపోచంపల్లి ప్రభుత్వోన్నత పాఠశాలలో సుమారు రూ.46 లక్షలతో పూర్తి చేసిన పనులను ఐక్లీన్ కంపెనీ ఎండీ ఓకేజిమ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ చైర్మన్ గోపి మాట్లాడుతూ.. తాను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నానని, సమాజానికి తమవంతుగా సహకారం అందించాలనే ఉద్దేశంతో గుండ్లపోచంపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు 20 ఏళ్లుగా సహాయసహకారాలు అందిస్తున్నామన్నారు. బిజెపి నాయకుడు అమరం మోహన్‌రెడ్డి సూచనతో పాఠశాలలో విద్యార్థులకు కొన్ని సదుపాయాలు అవసరం ఉన్నాయని తెలుసుకుని ఐక్లీన్ కంపెనీ యాజమాన్యంతో చర్చించి సుమారు రూ.46 లక్షల నిధులతో పాఠశాలలో తరగతి గదులు, ప్రాంగణంలో వేదిక షెడ్ నిర్మాణం, భోజనశాల, భవనానికి రంగులు వంటి సదుపాయాలు కల్పించామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, హెచ్ఆర్ గోపీచంద్, మాజీ కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతి, మున్సిపల్ అధ్యక్షుడు కవేరి శ్రీధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు


ఎమ్మెల్యే మల్లారెడ్డితో కమిటీ సభ్యులు

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లి ఆర్ఎల్‌నగర్‌లోని మహంకాళి, నల్ల పోచమ్మ ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన కొండేటి నర్సింహారెడ్డి గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సీనయ్య, కోశాధికారి కిరణ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు బొక్క శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ నేత, సతీశ్ కుమార్, మాజీ వార్డు సభ్యులు కొండేటి లతారెడ్డి, నాయకులు రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న కమిషనర్ వెంకట్‌రెడ్డి

కీసర: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి అన్నారు. 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని రాంపల్లి దాయరలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, తడి, పొడి వ్యర్థాల వేరు చేయడంపై అవగాహన, వీధి, పెంపుడు కుక్కలపై ప్రచారం చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా 15వ వార్డులో మున్సిపల్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈఈ బాలమురళి, మేనేజర్ వెంకటేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, వార్డు ఆఫీసర్లు, స్నేహ సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి


ఎంపీ ఈటలకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత, కాలనీవాసులు

మౌలాలి: మౌలాలి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ సునీత మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పీటీకాలనీ, ద్వారకమాయి కాలనీ ఫేజ్-2, నెహ్రూనగర్, గోకుల్‌నగర్ తదితర ప్రాంతాల్లో పవర్‌బోర్లు ఏర్పాటు చేసి తాగునీటి ఎద్దడిని నివారించాలన్నారు. ఎంపీ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పవర్‌బోర్లు ఏర్పాటుకు కృషి చేస్తానని హామీనిచ్చారని ఆమె తెలిపారు. కాలనీవాసులు, బీజేపీ నాయకులు గోపాల్‌గౌడ్, బీరప్ప, మల్లేశ్వరరావు, గుప్తా, శంకర్, శివగౌడ్, శ్రీనివాసయాదవ్, నటరాజ్, బబిత, లలిత, రేఖ, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ. 5 కోట్లతో ప్రతిపాదనలు


ప్రతిపాదనల కాపీని అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌లో రూ.5 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తెలిపారు. డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. చర్లపల్లి గ్రేవ్‌యార్డ్ పనులపై ఆరా తీశారు. నాగర్జుననగర్, లోకమాతకాలనీ, చర్లపల్లి, చిన్న చర్లపల్లి, ఐజీ కాలనీ, అంబేడ్కర్‌నగర్, విద్యామారుతీనగర్, కుషాయిగూడ, ఇంద్రానగర్‌తో పాటుగా పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలను డీఈ బాలకృష్ణకు అందజేశారు. సమావేశంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి



మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. డీఈ అన్వర్‌పాషా, ఏడీఈ చంద్రశేఖర్ ఇతర అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇటీవల సీఎండీని కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నారు. సఫిల్‌గూడ పార్క్ వద్ద 33 కేవీ లైన్ షిఫ్టింగ్, కొత్త స్పెన్సర్లు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారన్నారు. పలు ప్రాంతాల్లో తొలగించిన స్తంభాలను అక్కడే ఉంచడం వలన శానిటేషన్ సమస్యలు వస్తున్నాయని వాటిని తొలగించాలని సూచించామన్నారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో ఏఈలు శ్రీనివాస్, సుమన్ క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.